రేకుల షెడ్డులోనే విద్యా బోధన

పాఠశాల భవనం కూలినా పట్టించుకోని అధికార యంత్రాంగం

విశాలాంధ్ర - అరకులోయ: భారతదేశంలో స్వాతంత్రం వచ్చి నేటికీ 76 ఏళ్లు గడిచిన గిరిజన ప్రాంతంలో ప్రాథమిక విద్యాభివృద్ధి జరగటంలేదు. విద్యార్థులకు సరైన సౌకర్యం లేదని, చెట్టు కింద, పుట్ట కింద, పూరేగుడిసెలో, రేకుల షెడ్డులో విద్యాభ్యాసం జరుగుతుందని దానికి నిదర్శనమే అరకులోయ మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద పివిటిజి గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల(జిపిఎస్) దుస్థితి. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు నాడు నేడు పేరుతో రూపురేఖలు మారుస్తున్నామని చెబుతున్నా అవి కార్యరూపం దాల్చడం లేదు. మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద(జి పి ఎస్) గిరిజన ప్రాథమిక పాఠశాల భవనం లేక గ్రామస్తులు నిర్మించిన రేకుల షెడ్డులో విద్యార్థులకు ఉపాధ్యాయుడు నిరంతరం విద్యాబోధన చేస్తున్నాడని గ్రామస్తులు అంటున్నారు. పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం భారీ వర్షానికి గత ఏడాది కూలిపోయిందని, ఆదివారం సెలవు దినం కావడంతో ప్రమాదం ఏమీ జరగలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ, పీఓకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. తమ పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని తల్లితండ్రులు ఏకమై స్వచ్ఛందంగా ఇంటింటికి 1000 రూపాయిలు చందా వసూలు చేసి రేకు షెడ్డు పాఠశాల నిర్మించుకున్నామని తెలిపారు. పాఠశాల భవనం లేక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థులు తల్లితండ్రులు వాపోతున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి పిరిబంధ గ్రామంలో తక్షణమే నూతన పాఠశాల భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని కశింకోట వ్యవసాయ దారులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన విత్తనాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ బుధవారం పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు మంత్రి అమర్నాథ్ స్వయంగా విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీధర్ రాజు, ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్యనాయుడు, పార్టీ అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతిశ్రీనివాస్, సర్పంచ్ మంత్రి రజిని, ఎంపీపీ సూరిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, అద్దెపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు విరాళాలు సేకరణ

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని పద్మనాభం గ్రామంలో పోలవరం నిర్వాసితులకు విరాళాల సేకరణ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. తహశీల్దార్, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు సీపీఎం నాయకుల రవ్వ నర్సింగరావు ఆధ్వర్యంలో బృందం విరాళాలు సేకరణ చేసింది. స్థానిక ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ సహాయ సహకారాలు అందించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం పరిహారం ఇవ్వాలని అన్నారు. విరాళాల సేకరణ జూలై 7వ తేదీ వరకు జరుగుతుందన్నారు.

3న నాలుగో విడత చందన సమర్పణ

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారికి జూలై 3వ తేది ఆషాడ పౌర్ణమి రోజున 4వ విడత చందన సమర్పణ జరుగనుంది. ఇందుకు అవసరమైన శ్రీ చందనం అరగదీత బుధవారం ప్రారంభం అయింది. తొలి విడత చందనయాత్ర నాటి రాత్రి వైశాఖ శుద్ధ తదియ, రెండవవిడత వైశాఖ పౌర్ణమీ, మూడవ విడత జేష్ఠ పౌర్ణమీ, నాలగవవిడత ఆషాడ పౌర్ణమీలకు నాలుగు విడతలుగాను, చివరిగా శ్రావణ పౌర్ణమి రోజు కరాళ చందనం పెరుమాళ్ళకు చందనం సమర్పించటం జరుగుతుంది.

సమిద సంస్థ వితరణ

విశాలాంధ్ర - అనంతగిరి: స్థానిక సమిద స్వచ్ఛంద సంస్థ ఆద్యర్యంలో తుమ్మనవలస, పింపుడువలస, దముకు, బంగారంపేట, కపటీవలస, బలయగూడ, జకరివలస, మువ్వంవలస, సింగర్బ గ్రామాల్లో బైబిల్ టబర్నకల్ చర్చి అమెరికా వారి ఆర్థిక సహాయంతో 530 మంది పిల్లలకు స్టేషనరీ కిట్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు, అధ్యక్షులు పడాల రమణ పాల్గొని విద్యార్థులకు ఈ వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సమిద వలంటీర్లు, సమిద సిబ్బంది బుద్ధరాజు, సింహాద్రి, అప్పలరాజు, కృష్ణ, దేముడమ్మ, బలరాం, కాసులమ్మ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రానికి శ్రీ బూడి పేరు తగదు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రానికి శ్రీ బూడి రైతు భరోసా కేంద్రం అని పేరు పెట్టుకోవడం విచిత్రంగా ఉందని టీడీపీ నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నాలు గేళ్లుగా ఈ ప్రభుత్వంలో రైతులకు ఎరువులు, విత్తనాలు పంపిణీ, పంటకు గిట్టుబాటు ధర కల్పించడం వారిని ఆదుకోవడంపై చిత్తశుద్ధి కొరవడిందన్నారు. రైతు సమస్యలపై దృష్టి సారించకుండా ప్రజల సొమ్ముతో నిర్మించే భవనాలకు తమ పేరు పెట్టుకుని మురిసిపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర- గోపాలపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పార్వతీపురం - మన్యం జిల్లా కురుపాం పర్యటనలో భాగంగా విశాఖ విమానాశ్రయానికి చేరుకోవడంతో ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, పరిశ్రమలు, ఐటీ కమ్యూనికేషన్ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ

విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు విజయసాయిరెడ్డి, ఎంవివి సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రం వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కళ్యాణి, ఎమ్మెల్యేలు అవంతి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజు, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్ప గుచ్చాలు అందజేసి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు.

నవరత్నాల్లో గొప్ప రత్నం అమ్మఒడి

డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఏ తల్లి ఆర్థిక ఇబ్బందుల వలన తన బిడ్డలను బడికి పంపకుండా ఉండ కూడదనే ఒక గొప్ప సంకల్పంతో బడికి పిల్లలు పంపే ప్రతి తల్లికి ఏటా పదిహేను వేల రూపాయలు సీఎం జగన్ ఇస్తున్న నవరత్నాల్లోని ఓ గొప్ప రత్నం అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుఅన్నారు. పేద కుటుంబాలకు చెందిన తల్లి లేదా సంరక్షకుడికి ఆర్థికసహాయం అందించడం ఆంధ్రప్రదేశ్ అమ్మ ఒడి పథకం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేసిన అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిల్లలందరూ బడిబాట పట్టి చక్కని విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని ఒక వ్యక్తి యొక్క తరగతి, మతం, విశ్వాసం ఇతర సంబంధాలను పరిగణలోకి తీసుకోకుండా ఈ ఆర్థిక సహాయం అందించబడుతుందని కలెక్టర్ రవి పటాన్ శెట్టి అన్నారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా అమ్మఒడి 2022-23 సంవత్సరం గాను నాలుగో విడత 1,50,870 మంది తల్లుల ఖాతాలలో 226,3,50 కోట్లు జమ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. అనతరం సంబంధిత చెక్కును ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాధికారి వెంకట లక్ష్మమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శిరీష, గ్రామ వార్డ్ సచివాలయం నోడల్ అధికారి మంజుల వాణి పాల్గొన్నారు.

జగనన్న నాలుగో విడత అమ్మఒడి ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం శొంత్యం గ్రామపంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నాలుగో విడత జగనన్న అమ్మఒడి కార్యక్రమంను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగో విడతలో భాగంగా సుమారు 6263

మంది విద్యార్థులకు 8.14 కోట్ల రూపాయలు వారి తల్లులు ఖాతాలో జమ చేసామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో అడప లవ రాజు, మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, జడ్పిటిసి కోరాడ వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, స్థానిక సర్పంచ్ లంక లావణ్య, ఎంపీటీసీ పల్లా దుర్గ, మండల వైసిపి పార్టీ ఉపాధ్యక్షులు కోరాడ ముసలి నాయుడు, కాకర్లపూడి వరహాల రాజు, శ్రీకాంత్, లెంక రాంబాబు, పల్లా రమణ, రౌతు శ్రీను, ఎంఈఓ పద్మావతి, కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రిన్సిపల్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - భీమిలి: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్-3 పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆనందపురం మండలంలో శుక్రవారం లైన్ మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా జరగదని ఎలక్ట్రికల్ ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. పెద్దిపాలెం, బిపికల్లాలు, మచ్చవానిపాలెం, చందక, గొట్టుపల్లి, వెంకటాపురం, జగన్నాథపురం, పొడుగు పాలెంలో సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

రిజిస్టర్ పోస్ట్ ఆలస్యం: పంచాయతీ సమావేశం వాయిదా

విశాలాంధ్ర - పాయకరావుపేట: రిజిస్టర్ పోస్ట్ ఆలస్యం కారణంగా మండలంలోని అరట్లకోట పంచాయతీ సమావేశం వాయిదా పడింది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పంచాయతీ సమావేశం నిర్వహించాల్సి ఉంది. దీనికి సంబంధించి పంచాయితీ వార్డు సభ్యులకు ఈనెల 24వ తేదీన పంచాయితీ కార్యదర్శి డి.విజయరాజు పంచాయితీ సమావేశపు నోటీసులను రిజిస్టర్ పోస్ట్ చేశారు. అయితే సమావేశం నోటీసు రిజిస్టర్ పోస్టులు బుధవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ వార్డు సభ్యులకు చేరాయి. వార్డు సభ్యులందరూ నోటీసు అందుకున్న రోజునే సమావేశం కావడంతో అందుబాటులో లేక సమావేశానికి హాజరు కాలేకపోయారు. కేవలం సర్పంచ్, ఉప సర్పంచ్, మరో వార్డు సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరు కావడంతో, మెజార్టీ సభ్యులు లేక సమావేశం శనివారానికి వాయిదా వేశారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెహమాన్

విశాలాంధ్ర - విశాఖ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 2020 విద్యుత్ సంస్కరణలను బీజేపీ రాష్ట్రాల కన్నా ముందుగా వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ రెహమాన్ విమర్శించారు. గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న కరెంట్ ఆఫీస్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 196,197, 198 జీవోల ప్రకారంగా ఆస్తి మూలధన విలువపై పన్ను, చెత్త సేకరణ పన్ను, నీటి పన్నులను పెంచారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ ఛార్జీలను పెద్ద ఎత్తున పెంచడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈనెల 30వ తేదీన వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాను ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎం.మన్మధరావు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు, షేక్ మస్తాన్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్.రమణ, ఈ.శ్రీనివాసరావు, షేక్ రఫీ, వెంకట్రావు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆనందానికి సంగీతం ఎంతో ముఖ్యం

విశాలాంధ్ర - కె.కోటపాడు: సంగీతం వలన మానసిక ఉల్లాసం ఏర్పడటంతోపాటు శారీరకంగా ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీడీవో డాక్టరు కె.శచీదేవి అన్నారు. అయ్యన్న విద్యాసంస్థల స్కూల్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన "మ్యూజిక్ క్లాస్ రూమ్"ను

బుధవారం ఆమె ప్రారంభించారు. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రారంభోత్సవంలో ఎంపీడీవో మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు సంగీతం కూడా నేర్పాలన్న ఆలోచన రావడం హర్షనీయమని అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో విద్యాసంస్థల డైరెక్టరు నూర్జహాన్, సంగీత ఉపాధ్యాయురాలు మల్లాది సమీరా, స్కూల్ ప్రిన్సిపల్ హరీష, ఉపాధ్యాయుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ధురంధరుడు పి.వి.నర్సింహారావు

విశాలాంధ్ర -యలమంచిలి: నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి, బహుభాషా కోవిదుడు, స్థిత ప్రజ్ఞుడుగా పేరుగాంచిన భారతదేశ 9వ ప్రధాని పి.వి.నరసింహారావు 102వ జయంతి సందర్భంగా బుధవారం యలమంచిలి పట్టణంలో పీవీ కాంప్లెక్స్ వద్ద మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు విగ్రహానికి గాయత్రీ వేద పాఠశాల చైర్మన్ చంద్రమౌళి సోమేశ్వరరావు, యలమంచిలి ఎంపిపి బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు అరేపు గుప్తా, బెజవాడ నాగేశ్వర రావు, వైసిపి పట్టణ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్య దొర, గోశాల చైర్మన్ రాచకొండ పట్టాభిలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు, వేద పాఠశాల ప్రధాన కార్యదర్శి పెద్దింటి సూర్య నారాయణ, ట్రస్టు సభ్యులు సాంబశివరావు, గ్రామస్తులు గంధం శివ, నర్సిం హారావు, వేద పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: ఈనెల 30న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి (ఎండిఓ) ఎం.ఉషారాణి తెలిపారు. మండల ఎంపీపీ బాకా ఈశ్వరి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులతో పాటు మండలంలోని పలు శాఖల్లో విధులు చేపడుతున్న ఉన్నత స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

పలు గ్రామాల్లో మలేరియా పిచికారీ

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలోని కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల బంగారు మెట్ట గ్రామ సచివాలయంలోని పలు గ్రామాలతో పాటు బంగారు మెట్ట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో మలేరియా స్ప్రేయింగ్ నిర్వహించినట్లు వైద్యాధికారి ఎస్.రమేష్ తెలిపారు. ప్రతి ఒక్కరు తమ గృహాల్లో మలేరియా స్ప్రేయింగ్ పనులు నిర్వహించుకోవాలని అన్నారు. సరియాపల్లి, కిలగాడ గ్రామాలలో జాతీయ కుష్ఠ నివారణ కార్యక్రమం ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే చేసామని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమతెరలను వినియోగించుకుని మలేరియా వ్యాధికి స్వస్తి పలకలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కే.సుబ్రహ్మణ్యం, ప్రసాద్, వెంకటేశ్వరమ్మ, రజిని, జోలాపూట్ సబ్ యూనిట్ అధికారి టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రావాడలో ఆగని ఆక్రమణలు

విశాలాంధ్ర - పరవాడ: మండలంలోని రావాడ రెవెన్యూలో ఆక్రమణలు రోజు రోజుకీ రెట్టింపవుతున్నాయి. అక్రమార్కుల దాటికి కొండలు, గెడ్డలు, చెరువు గర్భాలు తదితర ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. ఒకరిని చూసి మరొకరు పోటాపోటీగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మోటూరు వానిపాలెం కొండను చదును చేసి నిర్మాణం చేపడుతుండగా, గొల్లగరువు సమీపంలోని సర్వేనెంబర్ 383లో గెడ్డను కప్పేసి ఆక్రమించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ రెండు చోట్ల జరుగుతున్న ఆక్రమణలను రెవెన్యూ సిబ్బంది నాలుగు రోజుల క్రితం అడ్డుకున్నారు. అయినా అక్రమార్కులు రెవెన్యూ హెచ్చరికలను ఏమాత్రం లెక్క చేయకుండా ఆ రెండు చోట్లా యధావిధిగా ఆక్రమణలను కొనసాగిస్తున్నారు. ఈ ఆక్రమణలను అడ్డుకోకుండా కొందరు స్థానిక నాయకులు ఎమ్మెల్యే పేరును ఉపయోగించి రెవెన్యూ సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకొని విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం

- 6 కేసుల్లో 183.75 క్వింటాళ్లు పట్టివేత
- పట్టుకున్న బియ్యానికి జూలై 3న వేలంపాట

విశాలాంధ్ర - పాయకరావుపేట: పేదలకు కోసం ఎంతో ఖర్చు చేసి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతుంది. ఇటీవల కాలంలో 6 కేసుల్లో అధికారులు పట్టుకున్న 183.75క్వింటాళ్ల బియ్యం నిదర్శనంగా నిలుస్తున్నాయి. పాయకరావుపేట మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో సుమారు 29,357 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రజలకు రేషన్ అందించేందుకు ప్రభుత్వం ప్రతీ నెలా సుమారు 400టన్నులు బియ్యం సరఫరా చేస్తుంది. రేషన్ పంపిణీ చేసేందుకు గ్రామాల్లో 50 రేషన్ డిపోలను ఏర్పాటు చేశారు. ఇవి చాలదన్నట్లు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు 20 వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. రేషన్ డిపోల్లో చాలా మంది బియ్యం తీసుకోవడం లేదు. రేషన్ బియ్యం తినే వారు మినహా మిగిలిన వారు డీలర్లకే రూ.12లకు అమ్మేస్తున్నారు. కొంతమంది డీలర్లు నిజాయితీగా రేషన్ సక్రమంగా పంపిణీ చేస్తే అక్కడ తీసుకున్న బియ్యాన్ని ఇంటింటికి తిరిగి కొనుగోలు చేసేవారికి ప్రజలు అమ్మేస్తున్నారు. ఇంటింటికి తిరిగి ఇవ్వాల్సిన వాహనాలు సక్రమంగా ఇళ్ల వద్దకు రావడం లేదు. పాయకరావుపేట పట్టణంలోని పలు కాలనీలతోపాటు, పాల్తేరు, పెదరామభద్రాపురం, సత్యవరం, అరట్లకోట, తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి గోడౌన్‌లలో భద్రపరుస్తున్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం కేంద్రాలుగా రేషన్ బియ్యం కొనుగోలు చేసే పెద్ద రాకెట్ నడుస్తుంది. పాల్తేరు గ్రామంలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి గోడౌన్‌లో దాచి పెట్టి లోగోలతో సంచులు తయారు చేసి రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించిన సంఘటనలు ఉన్నాయి. ఇక్కడే గతంలో అధికారులకు వచ్చిన ఫిర్యాదు మేరకు సుమారు 450క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పేదలకు కిలో బియ్యాన్ని రూ.1కే అందించేందుకు ప్రభుత్వం కిలో బియ్యాన్ని సుమారు రూ.32లకు కొనుగోలు చేస్తుంటే, అదే బియాన్ని రూ.12, నుండి రూ.15లకు ప్రజలు ఇంటింటికి తిరిగి కొనే వారికి అమ్మేస్తున్నారు. ఇటీవల కాలంలో జరిపిన దాడుల్లో 6 కేసులు నమోదు చేసి సుమారు 183.75 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తే సుమారు రూ.6లక్షలు ఖర్చు అవుతుంది. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని జూలై 3వ తేదీన అధికారులు వేలం వేయాలని నిర్ణయించారు.

VMRDA విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ

పత్రికా ప్రకటన

Rc.No.11021/54/2023/L8 (E-2122963), తేది. 27-06-2023

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునదేమనగా M/s గౌతమ్ ప్రాపర్టీస్ ప్రతినిధి శ్రీ సత్తారు మురళి, విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, భోగాపురం గ్రామం నందలి సర్వే సంఖ్య 374/1, 2, 3, 4, 5, ఎకరములు 2.1610 సెంట్లు గల భూమిని లేఔట్ అనుమతి నిమిత్తము దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఫైల్ ఆర్.సి. నెం.1167/0011/LP/VMRDA/2023 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.

కావున పైన తెలిపిన లేఔట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగియున్న యెడల ఈ ప్రకటన జారీచేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.

సం/- మెట్రోపాలిటన్ కమీషనర్, వి.ఎం.ఆర్.డి.ఏ

SARFAESI ACT 2002 క్రింద ఇ-వేలం అమ్మకం ప్రకటన

DCB BANK

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద స్థిరాస్తుల అమ్మకం

డిసిబి బ్యాంక్‌కు చార్జ్ చేయబడిన స్థిరాస్తుల అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన బహిరంగ ఇ-వేలం ప్రకటన.

దిగువ పేర్కొనబడిన ఆస్తిని డిసిబి బ్యాంక్ లిమిటెడ్‌కు మార్టిగేజ్ చేయబడిందని సాధారణ ప్రజానీకానికి మరీముఖ్యంగా ఋణగ్రహీతకు, సహ-ఋణగ్రహీతలకు మరియు హామీదారులకు అధీకృత అధికారిచే ఈ నోటీసు ద్వారా తెలియచేయడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సంక్రమించిన అధికారాలతో బ్యాంక్ యొక్క అధీకృత అధికారిచే దిగువ ఆస్తులను భౌతికంగా స్వాధీనం చేసుకోవడమైనది. దిగువ పట్టికలో పేర్కొనబడిన విధముగా, బకాయిసొమ్ము మరియు తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలు మొ॥ వాటితో సహా గల మొత్తాన్ని వసూలు చేయుటకై సదరు ఆస్తులను ఇ-వేలం ద్వారా విక్రయించబడును. సదరు ఆస్తులను "ఎక్కడ ఉన్నది అక్కడే" "ఉన్నది ఉన్నట్లే" మరియు "యదాతథం" ప్రాతిపదిక అమ్మబడును.

ఋణగ్రహీత(లు) మరియు సహ-ఋణగ్రహీత(లు) యొక్క పేరు : 1) శ్రీ శివప్రసాద్ పాలిక (ఋణగ్రహీత), 2) శ్రీమతి పాలిక జ్యోతి (సహ ఋణగ్రహీత)

స్థిరాస్తి యొక్క వివరములు: ఆస్తి యొక్క షెడ్యూలు-ఎ: (స్థలము యొక్క మొత్తము విస్తీర్ణము) ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం జిల్లా, ఆనందపురం ఎస్.ఆర్.ఓ పరిధిలోనిది, భీమునిపట్నం మండలం, తాళ్లవలస గ్రామం & పంచాయతీలో ఉన్న ఆర్ఎస్ నెం.77/3లో 5131.36 చదరపు గజాలు లేదా 4289.82 చదరపు మీటర్ల కొలత భూమి మొత్తంగా. ఆస్తి షెడ్యూలు-(గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నెం.జి.24): పై షెడ్యూలు ఆస్తి ప్రకారం మొత్తం భూ విస్తీర్ణంలో వైటిఆర్ రెసిడెన్సీ పేరిట నిర్మించిన అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ నందు 1068 చ॥అ॥ ప్లింత్ & ఉమ్మడి ప్రదేశం మరియు 40 చ॥అ॥ పార్కింగ్ ఏరియా, 36.31 చదరపు గజాల అవిభాజ్య వాటా కలిగియున్న ఫ్లాట్ నెం.జి24. ఆస్తి షెడ్యూలు-(మొదటి అంతస్తు, ఫ్లాట్ నెం.124): పై షెడ్యూలు ఆస్తి ప్రకారం మొత్తం భూ విస్తీర్ణంలో వైటిఆర్ రెసిడెన్సీ పేరిట నిర్మించిన అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తు నందు 1068 చ॥అ॥ ప్లింత్ & ఉమ్మడి ప్రదేశం మరియు 40 చ॥అ॥ పార్కింగ్ ఏరియా, 36.31 చదరపు గజాల అవిభాజ్య వాటా కలిగియున్న ఫ్లాట్ నెం.124.

సెక్యూర్డ్ బకాయి వివరాలు	రిజర్వుధర	ఇ-వేలం యొక్క తేదీ మరియు సమయం	జమచేయవలసిన బయానా	తనిఖీ తేది మరియు సమయం
ది.19-04-2021 నాటికి రూ. 24,62,640.70/-	రూ. 23,80,000/-	18-07-2023 ఉ॥ 11-30 గం॥ నుండి	రూ. 2,38,000/-	11.07.2023 ఉ॥ 11-00 నుండి సా॥ 4-00 వరకు

స్వాధీనం యొక్క స్వభావం: భౌతికంగా

వేలంలో పాల్గొనుటకు అభ్యర్థన లేఖ, కేవైసీ, పాన్‌కార్డ్, ఈఎండీ ప్రూఫ్‌తో ఇఎండీ సమర్పణకు చివరి తేదీ మరియు సమయం: 14 జూలై 2023న సా॥ 5.00 గం॥ల వరకు లేదా అంతకు ముందుగానే సమర్పించవలెను. వివరాలకు : పద్మరాజు, మొబైల్ : 9885548845 & పి.మురళీకృష్ణ, మొబైల్ : 8008123434 సంప్రదించగలరు.

ఉద్దేశించిన కొనుగోలుదారులు / బిడ్డర్లు బయానా సొమ్మును DD/NEFT/RTGS ద్వారా లబ్ధిదారుని పేరు : DCB Bank, అకౌంట్ పేరు : RAOU NON PDC, అకౌంట్ నెంబరు : 0272955100223, IFSC కోడ్ : DCBL0000027, అబిడ్స్ బ్రాంచి, హైదరాబాద్‌కు డిపాజిట్ చేయవలెను.

ఇ-వేలం యొక్క నిబంధనలు మరియు షరతులు దిగువ వున్నాయి :

1. ఇ-వేలం "ఎక్కడ ఎట్లా ఉన్నదో అట్లాగే" మరియు "అక్కడ ఉన్నది ఏమైనా" ప్రాతిపదికన "ఆన్‌లైన్"లో నిర్వహించబడుతోంది. బ్యాంక్ ఆమోదించిన సర్వీస్ ప్రొవైడర్ M/s. 4 క్లోజర్ ఇండియా ద్వారా వేలం నిర్వహించబడుతుంది. (సంప్రదింపు సంఖ్య...... వారి వెబ్‌పోర్టల్ https://www.bankauctions.in నందు) ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్‌ఫారం, డిక్లరేషన్, ఆన్‌లైన్ ఇవేలం విక్రయం యొక్క సాధారణ నియమ నిబంధనలని కలిగి ఉన్న ఇ-వేలం టెండర్ డాక్యుమెంట్ https://www.bankauctions.in నందు అందుబాటులో కలదు.
2. అధీకృత అధికారి యొక్క ఉత్తమ పరిజ్ఞానం మరియు సమాచారం మేరకు ఆస్తులపై ఎటువంటి తాకట్టు, ఋణభారాలు లేవు. అయినప్పటికీ బిడ్ దాఖలు చేయుటకు ముందుగా రాగోరు బిడ్డర్లు వేలంలో ఉంచబడిన ఆస్తుల యొక్క తాకట్టు ఋణభారాలు, టైటిల్ మరియు క్లెయిమ్‌లు / హక్కులు / బకాయిలకు సంబంధించి తమ సొంత విచారణలు చేసుకోవలెను. ఇ-వేలం ప్రకటన బ్యాంకు తరఫున ఏ విధమైన ప్రాతినిధ్యం వహించదు మరియు వహించునని భావించరాదు. చరాస్తి బ్యాంకునకు తెలిసిన మరియు తెలియని అన్ని ప్రస్తుత మరియు భవిష్య తాకట్టు ఋణభారములతో అమ్మబడుచున్నవి. అధీకృత అధికారి / సెక్యూర్డ్ క్రెడిటార్ ఏ విధమైన 3వ పార్టీ క్లెయిమ్‌లు / హక్కులు / బకాయిలకు ఏ విధంగాను బాధ్యత వహించజాలరు.
3. సఫలీకృతులు కాని బిడ్డర్ల యొక్క బయానాను ఎటువంటి వడ్డీ లేకుండా తిరిగి చెల్లించబడును. దిగువ సంతకందారుడు ఎటువంటి కారణం చూపకుండానే ఇ-వేలాన్ని అంగీకరించడానికి / వాయిదా వేయటానికి లేదా తిరస్కరించడానికి, ఏదైనా లేదా అన్ని ఆఫర్లను లేదా ఇ-వేలంను వాయిదా వేయుటకు లేదా రద్దుచేయుటకు దిగువ సంతకందారుడు హక్కు కలిగి వున్నారు. సఫలీకృత బిడ్డరు అధీకృత అధికారిచే బిడ్ ధర యొక్క ఆమోదం పొందిన మీదట వెంటనే అమ్మకం ధరలో 25% (బయానా మినహాయించి) ను మరియు మిగిలిన అమ్మకం ధరను అమ్మకం యొక్క 15వ రోజు అధీకృత అధికారి యొక్క పూర్తి విచక్షణ మేరకు డిపాజిట్ చేయవలసి ఉంటుంది. సఫలీకృత బిడ్డరుచే సదరు సొమ్ము యొక్క డిపాజిట్లో డిఫాల్ట్, ఇప్పటికే డిపాజిట్ చేయబడిన మొత్తం సొమ్ము యొక్క జప్తుకు దారి తీస్తుంది మరియు ఆస్తి తిరిగి వేలం వేయబడుతుంది మరియు డిఫాల్టింగ్ బిడ్డరుకు సదరు ఆస్తి/సొమ్మునకు సంబంధించి ఎట్టి క్లెయిమ్/హక్కు లభించదు. కొనుగోలుదారు వర్తించే స్టాంప్ డ్యూటీలు/అదనపు స్టాంప్ డ్యూటీ/ బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరాలను మరియు అన్ని చట్టబద్ధ/ చట్టబద్ధేతర బకాయిలు, పన్నులు, రేట్లు, మదింపు ఛార్జీలు, ఎవరికైనా చెల్లించాల్సిన ఫీజులు వగైరాలను కూడా భరించవలెను.
4. అమ్మకం సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద నిర్దేశించబడిన నియమాలు / నిబంధనలకు లోబడి ఉంటుంది.

తేది: 29-06-2023, ప్రదేశం: విశాఖపట్నం | సం/- అధీకృత అధికారి, డిసిబి బ్యాంక్ లిమిటెడ్

టీడీపీతోనే ప్రజలకు భవిష్యత్తు: కిడారి శ్రావణ్

విశాలాంధ్ర - అరకులోయ: అరకు నియోజకవర్గం అరకులోయ మండలం చినలబుడు పంచాయితీ హట్టగుడ గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, టీడీపీ యువ నాయకులు కిల్లో శ్యామ్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. అరకులోయ నుండి బైక్ ర్యాలీగా సభ ప్రాంగణంలో చేరుకోవటం జరిగింది. అనంతరం ఏడు గ్రామాల ప్రజలు సిపిఎం పార్టీ మాజీ ఎంపీటీసీ భర్త కిల్లో దయానిధి, వైసీపీ మాజీ వార్డు మెంబెర్ రాజు, చైతో, గోకుల్, పరమానందం, కన్నయ్య, పరశురామ్, కిల్లో వైకుంఠం, కిల్లో భాస్కరరావు, గుణవతితో సహా సుమారుగా ఏడు గ్రామాల వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారుగా 50 మంది మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ సమక్షంలో చేరారు. ప్రజలకు వైసీపీ ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయింది

అన్నారు. ఎక్కడ చూసిన అరాచక పాలన సాగుతుందని అన్నారు. టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట అధ్యక్షులు కొర్ర తులసిరావు, దుంబ్రిగుడ అధ్యక్షులు తుడుము సుబ్బారావు, అనంతగిరి అధ్యక్షులు అంబేర్తి బుజ్జిబాబు, పెదబయలు ప్రధాన కార్యదర్శి పాంగి నాగేశ్వరరావు, హుకుంపేట ప్రధాన కార్యదర్శి సిర్రం సూర్యకాంతం, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకురు వెంకటరమణ రాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు, టీడీపీ డివిజన్ నాయకులు పాంగి పాండురంగ స్వామి, టీడీపీ సీనియర్ నాయకులు బైసాబు త్రినాథ్, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు తామర్ల సత్యనారాయణ, అరకు పార్లమెంట్ ఆర్గనైజ్ సెక్రటరీ పాంగి శ్యాంబాబు, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజర్ సెక్రటరీ కిల్లో సాయిరాం, మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన్న, మాజీ ఎమ్మెల్యే సోమ సతీమణి సివేరి ఇచ్ఛావతి, అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శులు నరంజ ప్రసాద్, నేగెం సుందరరావు, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు కంబిడి సుబ్బారావు, కంబిడి భాస్కరరావు, అరకు యువ నాయకులు కిల్లో శ్యామ్, రమేష్, మాజీ సర్పంచ్ చాటరీ వెంకటరావు, అధికారిక సుబ్బారావు, అరకు పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శులు ఎలిపి కళావతి, కిల్లో సన్యాసమ్మ, కిముడు మహేశ్వరి, బోరి లక్ష్మి, ద్రౌపది, నీరజ, అరు మండలాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని వడ్డెగూడెం పంచాయితీ విఆర్ పురం బీసీ కాలనీలో బ్యాక్ టు ది రూట్స్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ గురూజీ ఆశీస్సులతో ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ గ్రామస్తుల సహకారంతో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట జరిగింది. విగ్రహ దాతలు పోస శ్రీకృష్ణ, పోస పద్మజ, యూఎస్ఏ వీరవల్లి తదితరుల సహకారంతో కార్యక్రమం జరిగింది. మండల జడ్పిటిసి వాళ్ల రంగ రెడ్డి, సబ్ డివిజన్ ప్రచారక్ కర్రీ చిన్న శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక గురువు శీలం పుల్లారెడ్డి , మండల మహిళా కన్వీనర్ బొడ్డు లక్ష్మీప్రసన్న, ఆధ్యాత్మిక వేత్త ముత్యాల రామారావు, కన్వీనర్ ముల్లా రమాదేవి, రేకపల్లి గ్రామ కన్వీనర్ ముత్యాల గాయత్రి, సబ్ డివిజన్ సహా కన్వీనర్ నోముల శ్రీనివాసరావు, మండల ధర్మ ప్రచార ముత్యాల శ్రీ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలో 13 వేల రూపాయలు జమ చేసినందుకు మండలంలోని వడ్డెగూడెం గ్రామంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఆనందోత్సాహాలతో జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సిపి నాయకులు ముత్యాల సాయి, బొర్రా శ్రీను, బాగుల చంద్రరావు, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో తిమ్మాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ఆక్రమణలను మండల తహశీల్దార్ విజయకుమార్ ఆధ్వర్యంలో తొలగింపు కార్యక్రమం ప్రారంభించారు. గతంలో కొందరు హైకోర్టుకు వెళ్లి గెడ్డ ఆక్రమణలకు గురికాదని తొలగించేలాగా ఆదేశాలు ఇవ్వాలని ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆదేశాలతో రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆక్రమణలను గుర్తించి మార్క్ చేయడం జరిగింది. అయితే ఆక్రమణలు తొలగింపచేయకపోవడంతో కోర్టుకు వెళ్లిన వ్యక్తులు మరల కోర్టును ఆశ్రయించారు. దీంతో రెవెన్యూ అధికారులు బుధవారం కోర్టు ఆదేశాల మేరకు 97/4 సర్వేనెంబర్ సమీపంలో ప్రహరీ గోడను జెసిబి తో తొలగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్యామ్ మండల సర్వేయర్ త్రిమూర్తి విఆర్ఓ గోవి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ఇఫ్కో ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార కూటమి

విశాలాంధ్ర -విశాఖ సిటీ: భారతీయ సహకార సంస్థలకు చారిత్రాత్మక చర్యగా, ఇఫ్కో ప్రయత్నాలతో, బోర్డ్ ఆఫ్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయన్స్ ఐ సి ఏ గ్లోబల్ బోర్డ్, జనరల్ అసెంబ్లీ మరియు అంతర్జాతీయ సదస్సును నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. 128 సంవత్సరాల చరిత్రలో మొదటిసారి జూన్ 2024న న్యూ ఢిల్లీలో ఈ సదస్సు నిర్వహించనుంది. ప్రపంచవ్యాప్తంగా 107 దేశాల నుండి 310 కంటే ఎక్కువ సహకార సంస్థలను ఐ సి ఏ దాని సభ్యులుగా కలిగింది. బ్రస్సెల్స్‌లో జరుగుతున్న ఐ సి ఏ బోర్డ్ మీటింగ్‌లో డాక్టర్ యూ ఎస్ అవస్తి, ఎండి ఇఫ్కో ప్రతిష్టాత్మక సమావేశాన్ని భారతదేశంలో నిర్వహించాలని ప్రతిపాదించారు. ఐ సి ఏ బోర్డు దానిని ఏకగ్రీవంగా ఆమోదించింది. డాక్టర్ యూ ఎస్ అవస్తి మాట్లాడుతూ, "భారతదేశంలో ఐ సి ఏ జనరల్ అసెంబ్లీ & అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించడం భారతదేశంలోని ఇఫ్కో మరియు సహకార వ్యాపారాలకు గర్వకారణం. భారతీయ సహకార రంగంలో మనందరికీ గొప్ప విజయం. ఇది సహకార రంగంలో కొత్త అవకాశాలను తెరుస్తుంది" అని అన్నారు

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో వేములవలసలో పంచాయితీలో బుధవారం ఓం శ్రీ సాయిరాం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి సహకారంతో విశాఖ పెదవాల్తేరు ఐ హాస్పిటల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

కార్యక్రమంలో 90 మందికి పరీక్షలు నిర్వహించగా పదిమందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎ.గణేష్ (కరెస్పాండెంట్ వెంకటేశ్వర స్కూల్), ఎం.విన్నయ్య సాయి కుమార్ (విశాఖపట్నం జిల్లా జోన్ కోఆర్డినేటర్), ఇ.సాయి కృష్ణ (విశాఖ ఐ హాస్పిటల్ కోఆర్డినేటర్), కె. తమ్మ నాయుడు (కన్వీనర్ గొట్టిపల్లి భజన మండలి), డి. శరత్ కుమార్ (జోనల్ యూత్ కోఆర్డినేటర్), కె.గోపి (మెడికల్ షాప్ ఓనర్), కె. లక్ష్మణ మూర్తి, పి వీర బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గౌరీపట్నం జంక్షన్ వద్ద పనస పండ్లు చాటున అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా వున్నాయి. పాడేరు ఏజెన్సీ నుండి ఐసర్ వ్యాన్ లో పనస పళ్ల లోడ్ లో బెంగళూరు తరలిస్తున్న 21 కేజీల గంజాయిను, ముందస్తు సమాచారం మేరకు ఎస్సై అప్పలనాయుడు తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను ఒక ఐసర్ వ్యాన్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. రిమాండ్‌కు తరలించిన వారిలో ఒకరు బెంగళూరుకు చెందినట్లు రెండో వ్యక్తి రితీష్ కుమార్, చిత్తూరు జిల్లాకు చెందిన శ్రీధర్‌గా గుర్తించామన్నారు.

ఆధార్ కేంద్రాన్ని పునః ప్రారంభించండి

విశాలాంధ్ర - చింతపల్లి: మండల కేంద్రంలో గల ఆధార్ సెంటర్ మూసి వేయడం వలన మండలంలోని గిరిజనులు చాలా ఇబ్బంది పడుతున్నారని చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు. ఆధార్ సెంటర్‌లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు అందడంతో ఆధార్ సెంటర్ సీజ్ చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఆధార్ సెంటర్ సీజ్ చేయడం వలన ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున కలెక్టర్ సుమిత్ కుమార్ తక్షణం స్పందించి ఆధార్ సెంటర్ పునఃప్రారంభం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎపిపీ సాగిన వెంగళరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాంగి గణబాబు, యువజన నాయకుడు పాల్గొన్నారు.

దోబిఘూట్ అభివృద్ధికై వినతి

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు పద్మనాథ నగర్ జనతా కాలనీ శ్రీ పైడిమాంబ రజక సేవా సంఘం వారందరూ జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి దోబీఘూట్, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయుట, మంచినీటి బోరు కొరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంపర సత్తిబాబు శ్రీ పైడిమాంబ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు తోకాడ రాము, అధ్యక్షులు యసలపు అప్పలరాజు, ఉపాధ్యక్షులు బీపురుపల్లి గంగాధర్, కార్యదర్శి నారు లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ చోడవరపు పైడిరాజు, కోశాధికారి కొండవలస కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-స్టాంప్ కౌంటర్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ -స్టాంప్ కౌంటర్‌ను సబ్ రిజిస్ట్రార్ ఎ.ఎస్.ఎన్.ఎస్.మూర్తి, వి.బసవేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ వ్యవహారాలకు సంబంధించిన స్టాంప్ డ్యూటీ, ఈ స్టాంపింగ్ పేపర్ ద్వారా పొందవచ్చన్నారు. సకల విక్రయాలను అధిగమించేందుకు ఈ స్టాంప్ వినియోగం చక్కని పరిష్కారమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఈ స్టాంప్ పేపర్ పట్ల వినియోగదారులు ఆసక్తి పెంచుకోవాలని, అగ్రిమెంట్లు, బ్యాంకు లోన్ అగ్రిమెంట్, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన లోటు స్టాంప్ డ్యూటీ ఈ స్టాంప్ పేపర్ ద్వారా కూడా పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది, కామన్ సర్వీస్ సెంటర్ వి.ఎల్.ఇ.వి.వెంకట రాము పలువురు పాల్గొన్నారు.

పాము కాటుకు గిరి మహిళ మృతి

విశాలాంధ్ర - చింతపల్లి: పాము కాటుకు గిరి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని తాజంగి పంచాయితీ కేంద్రంలోని బీటా లైన్‌లో బుధవారం చోటు చేసుకుంది. మంగళవారం పశువు దొడ్డిలో కలువు తీసేందుకు వెళ్ళిన సోమా వీరమణి (50) అనే గిరి మహిళను పాము కాటు వేసిందని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తీసుకువెళ్లగా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వైద్యులు తరలించారు. అప్పటికి ఆమె మృతి చెందినట్లు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

పీవీ నరసింహారావుకు ఘన నివాళులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పి.వి.నరసింహారావు 103వ జయంతి కార్యక్రమం బుధవారం గవర్నర్ బంగ్లా దగ్గర గల పి.వి. నరసింహారావు విగ్రహం వద్ద వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ మాజీ రెక్టార్ ఆచార్య ప్రసన్న కుమార్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా మన దేశానికి గొప్ప సేవలను అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు వైసీపీ ఇన్చార్జ్ పళ్ళ దుర్గా, 30వ వార్డు కార్పొరేటర్ అప్పల రత్నం, వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కప్పగంతు చరణ్ కుమార్, ప్రముఖ న్యాయవాది కె.వి.రామమూర్తి, విశ్రాంత పోలీస్ అధికారి యస్.దివాకర్, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ సభ్యురాలు సుబ్బలక్ష్మి, శంకర్ నీలా తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ ధ్యేయం

విశాలాంధ్ర - కె. కోటపాడు: విశాఖ డెయిరీ పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని డైరెక్టర్ సుందరపు గంగాధర్ అన్నారు. మండలంలోని చౌడువాడ పాల సేకరణ కేంద్రం వద్ద బుధవారం ఆ సొసైటీ అధ్యక్షులు కుమార వెంకటరమణ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్ని ప్రైవేట డైరీలు పుట్టుకొచ్చిన విశాఖ డెయిరీకి సరి సమానం కావన్నారు. 2012లో అప్పటి చైర్మన్ ఆదారి తులసి రావు ఆదేశాల మేరకు కేంద్రం వద్ద వినియోగదారులకు పాలు అమ్మకాన్ని రద్దు చేశామని ఇప్పటి చైర్మన్ ఆనంద్ కుమార్ ఆదేశాలు మేరకు వినియోగదారులకు పాలు అమ్మే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇటీవల మృతి చెందిన 8 పశువులకు పశు బీమా పథకమును అలాగే మరణించిన 11 మంది రైతులకు రైతు బీమా పథకాన్ని అందజేశారు. నాణ్యమైన అధిక ఫేట్ పాలు సరఫరా చేసిన ముగ్గురు రైతులకు, అలాగే నాణ్యమైన అధిక అవపాలు సరఫరా చేసిన ముగ్గురు రైతులకు బహుమతులు అందజేశారు. అనంతరం పిఎస్. దిన్ని వెంకట నరసింహమూర్తి ఈ ఆర్థిక సంవత్సరంలో సొసైటీ నిర్వహించిన కార్యకలాపాల నివేదికను చదివి వినిపించారు. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు శిల్లర శెట్టి వెంకటరావు, గొలగన నాగేశ్వరరావు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రభుత్వమే నడపాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కాలేజీ గ్రౌండ్ పక్కన ఎకరా పది సెంట్ల విస్తీర్ణంలో రూ.25 కోట్లతో జీవీఎంసీ నిర్మించిన మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను సహస్ర అనే ప్రయివేటు సంస్థకు మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) కట్టబెట్టడాన్ని సీపీఎం వ్యతిరేకిస్తూ బుధవారం నిరసన చేపట్టింది. ప్రజల ఆస్తులను ప్రయివేటు సంస్థలకు దోచిపెట్టే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీ కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఇండోర్ స్పోర్ట్స్‌ను ప్రయివేట సంస్థకు ఇవ్వకుండా, దీని నిర్వహణ బాధ్యతను జివిఎంసి చూడాలని, భారీగా విధించిన ఫీజులు రద్దుచేయాలని కోరారు. స్విమ్మింగ్‌పూల్ కు నెలకు 5000/-, బాడ్మింటెన్‌కు 5000/-, వాలీబాల్‌కు 6000/-, టేబుల్ టెన్నిస్‌కు రూ.2,500/-, చెస్‌కు రూ.1500/-, యోగాకు 2000/-, ఆదివారం రోజున బ్యాడ్మింటెన్‌కు ప్రతి గంటకు 1000 రూపాయలు, జిమ్‌(క్రాస్ ఫిట్ ట్రైనింగ్)కు 8000/- చొప్పున ప్రయివేట సంస్థ వసూలు చేస్తోందన్నారు. తక్షణమే ప్రైవేటీకరణ చర్యలు వీడకపోతే ప్రజాఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు కె.కుమారి, వి.వెంకటరావు, కొండల, అప్పారావు, తులసీరాం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణకు మహాజన సోషలిస్టు పార్టీని బలపరచండి

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ యువ సేన అధ్యక్షుడు యలక మల్లి బాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జిల్లా సమావేశంలో ఎస్సీ వర్గీకరణపై అన్ని పార్టీలు మాట తప్పాయని, వర్గీకరణకు కట్టుబడి ఉన్న మహాజన సోషలిస్టు పార్టీకి మాదిగలు ఓట్లు వేయాలని ఉత్తరాంధ్ర కన్వీనర్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ కోరారు. అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ గోటివాడ స్మార్ట్ కుమార్ అధ్యక్షతన ఇందిరా కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించారు. చలో హైదరాబాద్ సమావేశానికి సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 8 శాతం పైగా ఉన్న మాదిగలను అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయన్నారు. వర్గీకరణకు సహకరించని పార్టీల జెండాలు మోయవద్దని, అలాగే 2024 ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సి.ఎం. వైయస్ జగన్మోహన్ రెడ్డి వర్గీకరణ పై అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి, కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధనకు జూలై మూడో వారంలో 20 లక్షల మంది ప్రజలతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేసారు. ఈ యాత్ర శ్రీకాకుళం నుండి ప్రారంభమై, చలో హైదరాబాద్ వరకు కొనసాగే సన్నాహక సమావేశాలు ఉత్తర ఆంధ్ర కోస్తా జిల్లాల అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు జరుపుతున్నామని అన్నారు. వర్గీకరణ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్‌తో మహాజన సోషలిస్టు పార్టీ అండగా వుండి, చట్ట సభల్లో అడుగుపెట్టి దిశగా ప్రజలను చైతన్యం చేయడమే తమ లక్ష్యంగా తమ పర్యటన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎం.ఇ.ఎఫ్ ఉపాధ్యక్షులు మల్లి పూడి సత్యనారాయణ మాదిగ, అనకాపల్లి జిల్లా ఎంఎస్‌పి కన్వీనర్ ఏలుసూరి గాబీలు మాదిగ, ఉమ్మడి జిల్లా ఎంఇఎఫ్ అధ్యక్షుడు ఆళ్ళోట రవి మాదిగ, విశాఖ జిల్లా ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ అధ్యక్షుడు తొత్తడ మూడి శ్రీనివాసరావు, మాదిగ, విశాఖ జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఉప్పాడి ప్రవీణ కుమార్ మాదిగ, అనకాపల్లి నియోజక వర్గం కో- కన్వీనర్ కట్టమూరి మంగ రాజు మాదిగ, ఎం ఇ ఎఫ్ నాయకుడు మొల్ల శ్రీను, దువ్వి దుర్గారావు మాదిగ, రాజు బాబు మాదిగ, ఇండుగుపల్లి గోపీ మాదిగ, మరియు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎమ్మెస్ ఎఫ్, నాయకులు మహిళా కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్‌పిఐఇఎఫ్‌లో రక్షిత ఆర్కిటిక్ ప్రాంతాల అభివృద్ధిపై చర్చ

విశాలాంధ్ర- విశాఖ సిటీ: ఆర్కిటిక్‌లోని పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ మరియు ప్రత్యేకంగా రక్షిత సహజ ప్రాంతాలను అభివృద్ధి చేసే అవకాశాలు "రష్యన్ ఆర్కిటిక్ - ఫోకల్ పాయింట్" సెషన్‌లో చర్చించబడ్డాయి. 21వ శతాబ్దంలో రక్షిత ప్రాంతాలు "సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్ సందర్భంగా నిర్వహించబడింది. ఈ ఈవెంట్ 2021-2023లో ఆర్కిటిక్ కౌన్సిల్‌కు రష్యా అధ్యక్షుడిగా ఉంది, రోస్‌కాంగ్రెస్ ఫౌండేషన్ చైర్మన్ ఈవెంట్‌ల నిర్వహణ. ఆర్థిక అవరోధాలు, వారి బాధ్యతాయుతమైన ఈ ఎస్ జీ పద్ధతులు, ప్రాంతాల పాత్రను ఏకీకృతం చేయడం కోసం ఒక సమగ్ర కార్యాచరణను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యం. మేము నిజంగా అలాంటి భావనను రూపొందించినట్లయితే, ఆర్కిటిక్ ప్రాంతం యొక్క నిజమైన స్థిరమైన అభివృద్ధిని మేము నిర్థారించగలము, ఆర్థిక, పర్యావరణ మరియు సామాజిక ఎజెండాను సమతుల్యం చేస్తాము. ఈ ప్రాంతంలో అంతర్జాతీయ సహకారాన్ని అందించడం కూడా చాలా కీలకం" అని రష్యన్ ఫెడరేషన్ యొక్క విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రాయబారి మరియు సీనియర్ ఆర్కిటిక్ అధికారుల చైర్ అయిన నికోలాయ్ కోర్చునోవ్ అన్నారు.

అంగన్వాడీల సమస్యలపై 10,11 తేదీల్లో ధర్నా

విశాలాంధ్ర - కే.కోటపాడు: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ (ఏఐటియుసి) జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో గౌరవ అధ్యక్షులు జె.కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి రూపాయలు జీతాన్ని పెంచుతానని వాగ్దానం చేశారని ఇప్పటివరకు దీని అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, 300 జనాభా దాటిన మినీ అంగన్వాడీలని మెయిన్ అంగన్వాడీలుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, అంగన్వాడీ వర్కర్, ఆయా రిటైర్మెంట్ అయితే 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం సిడిపిఓ మంగతాయారుకి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అమ్మాజీ, అధ్యక్షురాలు వరలక్ష్మి భవాని, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనపై ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు సంతలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు డివిఎస్ఎన్ రెడ్డి అధ్యక్షతన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 9సంవత్సరాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేపట్టారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం వెంకయ్య, మండల అధ్యక్షులు మాట్లాడుతూ రాబోయే కాలంలో దేశాన్ని కాపాడేది బిజెపి మాత్రమేనని అన్నారు. అలాగే పోలవరం నిర్వాసితులు, దళితులు, గిరిజనుల అభివృద్ధి కోసం బిజెపి అంకిత భావంతో సేవ చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సవరం ముత్తయ్య, తుష్టి సుబ్బయ్య, మీడియం రాజారావు, సవలం అదమ్మ, సోడి శేషమ్మ, పాయం సుజాత, వెట్టి చంద్రయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు మండలంలోని మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు, ఎస్ఇబి పట్నాల్ ఆధ్వర్యంలో లక్కవరం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేశారు. స్కూటీపై నలుగురు వ్యక్తులు అక్రమంగా 12 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ గంజాయిని సింధువాడ నుండి చెన్నైకు తరలిస్తున్నట్లు ఎస్సై, ఎస్ఇబి తెలిపారు. ఈ కేసులో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి రంపచోడవరం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ 40 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. తహశీల్దార్ కారం సుబ్బారావు, మోతుగూడెం వీఆర్వో సమక్షంలో పంచనామా నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మురళి, సన్నీ పాల్గొన్నారు.

శ్రీమతి ఆంధ్రాగా నిర్మల నృత్యనికేతన్ పూర్వ విద్యార్థిని

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి చినముషిడివాడ వద్ద గల నిర్మల నృత్యనికేతన్ పూర్వ విద్యార్థిని వి.శైలజ ఆంధ్రా అవార్డును గెలుచుకున్నారు. ఢిల్లీలో జలజోష్ ప్రొడక్షన్ సంస్థ ఆధ్వర్యంలో అఖిల భారత్ నిర్వహించిన ఫైనల్ పోటీలలో శైలజ శ్రీమతి ఆంధ్రా, శ్రీమతి నమ్మకం అవార్డులకు ఎంపికయ్యారు. దేశంలో నిర్వహించిన ఆడిషన్స్‌లో 250 మంది పోటీపడగా 25 మందిని ఎంపిక చేసి ఢిల్లీ తీసుకెళ్లినట్లు శైలజ తెలిపారు. ఢిల్లీలో ఏపీతో పాటు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వారికి పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారని తెలియచేసారు. కాగా తమ విద్యార్థిని శ్రీమతి ఆంధ్రాగా ఎంపిక కావడం పట్ల నిర్మల నృత్యనికేతన్ ప్రిన్సిపల్ డాక్టర్. విజయజ్యోతి సంతోషం వెలిబుచ్చారు.

చిట్టీల నిర్వాహకురాలు అదృశ్యంపై కేసు

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి వేపగుంట సమీపంలోని వరలక్ష్మీనగర్‌కు చెందిన చిట్టీల నిర్వాహకురాలు బొండా బంగారమ్మ కనిపించలేదని ఆమె కుమారుడు శంకర్ పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ నెల 26న సాయంత్రం 5 గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా తన తల్లి ఆచూకీ లభించలేదని శంకర్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. చిట్టీలు నిర్వహించే బంగారమ్మ, ఇటీవల నష్టపోవడంతో చాలామందికి బకాయి పడ్డారని, వారు ఒత్తిడి తీసుకురావడంతో భయపడి ఎక్కడికో వెళ్లిపోయి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై ఆర్.అనిరుధ్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిమిత్తం హెడ్ కానిస్టేబుల్ ఎం.ప్రకాశ్‌కు అప్పగించారు.

ధరాఘాతం...
సామాన్య ప్రజల పాలిట శరాఘాతం

విశాలాంధ్ర - చింతపల్లి: ధరాఘాతం సామాన్య ప్రజల పాలిట శరాఘాతంగా మారింది. మునుపెన్నడూ కానీ విని ఎరుగని రీతిలో ధరలు పెరిగి సామాన్య ప్రజానీకంపై సమ్మెట పోటుగా మారాయి. నాడు సినీ గేయ రచయిత చెప్పినట్లుగా "ఏమి కొనేటట్ల లేదు ఏమి తినేటట్ల లేదు నాగులో నాగన్న" అన్నట్లుగా నేడు పరిస్థితులు తయారయ్యాయి. బుధవారం చింతపల్లి వారపు సంతలో టమాటా ధర కేజీ 100 పలకగా అల్లం, పచ్చిమిర్చి ధరలు కూడా అదే రీతిలో కొనసాగాయి. ఆకుకూరలు, కూరగాయలే గాక నిత్యవసర సరుకుల ధరలు సైతం నింగి నంటాయి. చేపలు, మాంసం ధరలు కూడా సామాన్య ప్రజానీకానికి అందుబాటులో లేనివిధంగా తయారయ్యాయి. ఆషాడ మాసంలోనే ఆకుకూరలు, కాయగూరలతో సహా నిత్యవసర సరుకుల ధరలు ఈ విధంగా పెరిగిపోతుండడం చూస్తే శ్రావణమాసంలో వీటి ధరలు మరింత పెరిగిపోయే అవకాశం లేకపోలేదని పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం లేచింది మొదలు ప్రతి ఇంటిలో పాల ప్యాకెట్ తో మొదలయ్యే నిత్యవసరాల దగ్గర్నుంచి అన్ని ధరలు పెరిగి పోవడం సామాన్య ప్రజానీకానికి రానున్న కాలంలో పెనుబారంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న ధరలను నియంత్రించవలసిన పాలకులు, అధికారులు వాటిని నియంత్రించడంలో వైఫల్యం చెందుతున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పెరుగుతున్న ధరలను నియంత్రించాలని మన్య ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వైయస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా పిల్లల వివరాలు నమోదు చేయండి

విశాలాంధ్ర - చింతపల్లి: వైయస్సార్ సంపూర్ణ పోషణ యాప్ పై ఏఎన్ఎంలు , మహిళా సంరక్షణ అధికారిని (ఎం ఎస్ కె) లతోపాటు అంగన్వాడి కార్యకర్తలు కూడా అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఓ రమణి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు మహిళా సంరక్షణ అధికారినిలు, అంగన్వాడి సూపర్వైజర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీవో ఆశాజ్యోతి మాట్లాడుతూ వైయస్సార్ సంపూర్ణ పోషణ అంగన్వాడీ పరిధిలోని పిల్లలకే గాక గర్భిణీలు, బాలింతలకు వరమన్నారు. ఈ వైయస్సార్ సంపూర్ణ పోషణ యాప్ లో అంగన్వాడి కేంద్ర పరిధిలో ఉన్న పిల్లలందరినీ నమోదు చేయాలని తెలిపారు. ఇందుకుగాను ఏఎన్ఎం వద్ద ఉన్న యాప్ లో నమోదు ప్రక్రియ పూర్తి చేసి అదే యాప్ మహిళా సంరక్షణ అధికారినిలకు, వారి వద్ద నుండి అంగన్వాడీ కార్యకర్తలకు ఈ యాప్ పంపించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ముగ్గురి వద్ద ఉన్న యాప్ లలోని వివరాలు ఒకేలా ఉండేలా చూసుకోవాలని, లేనిపక్షంలో ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉత్పన్నం అవుతుందని తద్వారా ప్రతి ఒక్కరు ఇబ్బంది పడవలసి వస్తుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఏసీడీపీఓ రామలక్ష్మి, సూపర్వైజర్లు విజయ కుమారి, గౌహరున్నీషా, సత్యవతి, గౌరీ, అప్పల నరస లతో పాటు మండలంలోని ఏఎన్ఎం లు, ఎం ఎస్ కే లు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండల నాయకులు ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా సమస్యలు ఎలా పరిష్కరించాలో ప్రజలకు క్షుణ్ణంగా వివరిస్తున్నారు. కొండిబ పంచాయతీ వైస్సార్సీపీ నాయకులకు మీ పంచాయతీలో ఉన్న ప్రజలందరికీ జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తిగా అవగాహన కల్పించి ప్రజలు లబ్ధి పొందేలా చేయాలని కన్వీనర్లకు, గృహసారథులు మరియు స్థానిక వైఎస్సార్సీపీ నాయకులకు చెప్పుతు జగనన్న సురక్ష ద్వారా ప్రజలు లబ్ధి పొందే 10 అంశాలు అక్కడ ఉన్న స్థానిక నాయకులకు వివరించడం జరిగినది. ప్రతి ఒక్కరు లబ్ధి పొందాలి అని తెలియజెయ్యాడము జరిగింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లకులు మీ ఇంటి వద్దకు వచ్చి అవగాహన కల్పిస్తున్నారా అని ప్రజలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కొర్ర సూర్యనారాయణ, మాజీ పిఎసిఎస్ చైర్మన్ గుజ్జెల మధుసూదన్, మాజీ సర్పంచ్ దూర్య రత్నకుమారి, సుబ్బారావు, గుమ్మ పంచాయతీ కన్వీనర్ కురడబోయిన గంగరాజు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు పోతురాజు, పరుశురాం, వైసీపీ కన్వీనర్ సింహాద్రి పాల్గొన్నారు.

స్పెషల్ అలవెన్స్ వర్తింపజేయాలని నిరసన

విశాలాంధ్ర - పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కార్మికులకు స్పెషల్ అలవెన్స్ వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ బీఎమ్మెస్,టీఎన్టియూసీ ఆధ్వర్యంలో బుధవారం పరిశ్రమ ప్రధాన ద్వారం వద్ద కార్మికులు నిరసనకు దిగారు. ముఖ్యంగా రైల్వే ట్రాక్‌లో పనిచేస్తున్న కార్మికులకు ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలని, పరిశ్రమలో ఏర్పాటు చేసిన మెడికల్ పరీక్షలు ఎత్తివేయాలని, కార్మికులు అదరికీ ఒకే రకమైనటువంటి గేటు పాస్ వర్తింప చేయాలని,

అన్ స్కిల్డ్ కార్మికులను సెమీ స్కిల్డ్, సెమీస్కిల్డ్ కార్మికులను స్కిల్డ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ అలవెన్స్ మంజూరు చేసే వరకు ఈ నిరసన కార్యక్రమం కొనసాగిస్తామని కార్మిక నాయకులు హెచ్చరించారు. టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాసవరపు అప్పలనాయుడు, అఖిల భారత ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి ఎల్ ప్రసాద్, అధ్యక్షుడు బి.రమణ, జనరల్ సెక్రెటరీ సతీష్,డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కుంచరాజు తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ పీఓగా వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ ప్రణాళికా విభాగం ప్లానింగ్ ఆఫీసర్ గా కె.వెంకటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రస్తుతం జీవీఎంసీ జోన్ 2 ఏసీపీ గా పనిచేస్తున్నారు. ఆయనకు త్వరలో ప్రమోషన్ వచ్చే అవకాశం ఉంది. దీంతో ఏసీపీ క్యాడర్ లో ఉన్నా పీఓ క్యాడర్ లో నియమించారు. వీఎంఆర్డీఏ లో పనిచేస్తున్న పీఓ సత్యనారాయణను మచిలీపట్నం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ కి బదిలీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. వెంకటేశ్వరరావు ఏపీ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడం అభినందనీయం

విశాలాంధ్ర - చింతపల్లి :- బడి బయట పిల్లలను (డ్రాప్ అవుట్) పాఠశాలలో చేర్పించేందుకు తీసుకువచ్చిన కొత్తూరు బైలు అంగన్వాడీ కార్యకర్త శాంతి, అన్నవరం మహిళా సంరక్షణ అధికారిని కిముడు కళావతి లు అభినందనీయులని స్థానిక ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. బడి ఈడు ఉన్న కొత్తూరు బయలు గ్రామానికి చెందిన ముగ్గురు అమ్మాయిలను ఐసిడిఎస్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న స్థానిక ఎంపీడీవో ఆశాజ్యోతి సిడిపిఓ రమణితో కలిసి వారికి విద్యపై అవగాహన కల్పించారు. విద్య ద్వారానే అన్ని విధాల అభివృద్ధి సాధ్యమని

సూచించడమే గాక స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ (బాలికల) ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ రమణితోపాటు ఏ సి డి పి ఓ కే రామలక్ష్మి, ఆశ్రమ వసతి గృహ అధికారిని నూకరత్నం, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎల్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

విశాలాంధ్ర -పెందుర్తి: మూడో విడత వై.యస్.ఆర్ ఆసరా సొమ్ము లబ్ధిదారుల ఖాతాలోకి నేరుగా జమ అయిన సందర్భంగా జీవీఎంసీ 95వ వార్డు గొల్లవిల్లివానిపాలెం వై.యస్.ఆర్ ఆసరా మహిళా లబ్ధిదారులతో కలిసి జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సిఎం జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీకి

క్షీరాభిషేకం చేశారు. మహిళలు హర్షధ్వానాలతో థాంక్యూ సీఎం సార్ అని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడ ఏ పథకాలు ఆపకుండా ప్రజలకు మంచి చేయాలని మంచి ఆలోచనతో మాట ఇచ్చిన ప్రకారం మూడో విడత డ్వాక్రా మహిళల లబ్ధిదారుల అక్క చెల్లెమ్మల ఖాతాలోకి నేరుగా సొమ్ము జమ చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ సీఏ కనకరత్నం,వైకాపా నాయకులు రాపర్తి సూరిబాబు, మంగమ్మ,సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన సంతోష్,బొడ్డు దేముడుబాబు, లబ్ధిదారులు వెంకటేష్,స్కేటింగ్ మురళి, ఆర్పి మహిళ కనకమహాలక్ష్మి,ఆసరా మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

బక్రీదు రోజు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

విశాలాంధ్ర - మధురవాడ : జోన్ 3 విద్యుత్ డివిజన్ (మధుర వాడ)పరిధిలో గల అన్నీ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లులు వసూళ్ల కౌంటర్లు బక్రీద్ రోజున గురువారం కూడా పని చేస్తాయని ఇ.ఈ(.ఆపరేషన్.) పోలిక శ్రీనివాస్ రావు వో ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ విని యోగ దారులు సద్వినియోగం చే సు కావాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

ఏకలవ్య విద్యార్థులకు ఎన్ని కష్టాలో..?

విశాలాంధ్ర - కొయ్యూరు : మన్యంలో ఏకలవ్య విద్యార్థులకు ఎన్ని కష్టాలో అని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రతిష్టాత్మకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 28 ఏకలవ్య పాఠశాల ఏర్పాటు చేసి ప్రవేశ పరీక్ష ద్వారా గిరిజన విద్యార్థులను ఎంపిక చేయడంతో పాటు నాణ్యమైన సీబీఎస్ఈ సిలబస్ ద్వారా విద్యానందిస్తుండడం అభినందనీయం అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్ పరిధిలో ప్రతి మండలానికి ఒక ఏకలవ్య పాఠశాల ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో వసతి సౌకర్యాలు కల్పిస్తుండగా కొయ్యూరు మండలంలో గల ఏకలవ్య పాఠశాల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందన్నారు. మండలంలో ఏకలవ్య పాఠశాలను బాలారం లో ఏర్పాటుకు ప్రతిపాదన చేయగా ఆ స్థలంలో పాఠశాల నిర్మాణానికి కొంతమంది అభ్యంతరం తెలపడంతో నిర్మాణం నిలిచిపోయిందన్నారు. దీంతో పాఠశాల తాత్కాలికంగా నడపడానికి కొయ్యూరు గురుకుల పాఠశాలలో %ఖ%రెండు భవనాలు సమకూర్చగా అందులో ప్రస్తుతం చాలీచాలని వసతులతో నడుపుతూ ఈ ఏడాది చింతపల్లి వైటీసీలోకి బదిలీ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు రాజబాబు తెలిపారు. పాడేరు ఐటీడీఏ అధికారులు రంపచోడవరం ఐటిడిఏ అధికారులతో మాట్లాడి కొయ్యూరు మండలానికి సమీపంలో రాజవొమ్మంగి మండలంలో మారుమూల ప్రాంతంలో గల తాళ్లపాలెంలో ఏకలవ్య పాఠశాల నడపడానికి నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. అయితే తాళ్లపాలెం గ్రామానికి ఎటువంటి వాహన సదుపాయం కానీ ఆసుపత్రి సదుపాయం కానీ లేదని గతంలో తాళ్లపాలెం గ్రామంలో నిర్వహించిన ఆశ్రమ పాఠశాల పాత భవనాల్లో ప్రస్తుతం ఏకలవ్య పాఠశాల నడపడానికి అధికారులు తీసుకొన్న నిర్ణయంలో ఆంతర్యం ఏమిటో తెలియటం లేదని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యాలభ్యసించాల్సిన చిన్నారి బాలబాలికలు మారుమూల ప్రాంతంలో ఎటువంటి వసతులు లేని చోట ఎలా ఉండగలరని ఆవేదన వ్యక్తం చేశారు. బాలరంలో భవనాల నిర్మించేంతవరకు చింతపల్లి వైటీసీలోనే ఏకలవ్య పాఠశాల నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నట్లు రాజబాబు తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఐటీడీఏ పీవో ఈ ప్రాంత ఎంపీ ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని చింతపల్లి మండల కేంద్రంలో గల వైటీసీ లోనే పాఠశాల నడపాలని జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజుబాబు కోరారు.

ఏజెన్సీలో మూడేళ్లు పూర్తి చేసుకున్న
పోలీసు సిబ్బందిని బదిలీ చేయండి

విశాలాంధ్ర - చింతపల్లి : నూతనంగా ఏర్పడిన అల్లూరి జిల్లా ఏజెన్సీ పోలీసు స్టేషన్లలో మూడేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి న్యాయపరంగా బదిలీలు నిర్వహించాలని వారి కుటుంబ సభ్యులు సంబంధిత ఉన్నతాధికారులకు వినతి పత్రం అందించడం జరిగిందని వారి భార్యలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో మూడేళ్లు పైబడి విధులు నిర్వర్తించిన పోలీసులను మైదాన ప్రాంతాలకు, మైదాన ప్రాంతంలో నాలుగేళ్లు విధులు నిర్వహించిన వారికి ఏజెన్సీ ప్రాంతానికి బదిలీలు చేసే ప్రక్రియ కొనసాగేది. నాలుగేళ్లకు పైగా ఏజెన్సీ అటవీ ప్రాంతం అయిన అల్లూరి జిల్లాలో కుటుంబాలకు దూరంగా ఉండి, కొంతమంది పోలీసులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతూ ఆసుపత్రుల పాలై, పిల్లల చదువులు మరియు వారి బాగోగులు, శుభకార్యాలు (పెళ్ళిళ్ళు) చేయుటకు, అదే క్రమంలో వయస్సు పై బడిన తల్లి దండ్రులను సంరక్షించుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ అటు మానసికంగా, ఇటు శారీరకంగాను తీవ్ర ఒత్తిళ్లకు గురిఅవుతున్న తమ భర్తలను తక్షణమే బదిలీ చేయాలంటూ మహిళలు మొరపెట్టు కుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నాలుగేళ్లకు పైగా విధులు నిర్వహించినప్పటికీ, ఉమ్మడి విశాఖ జిల్లాలో భాగమైన ప్రస్తుత అనకాపల్లి జిల్లాకు బదిలీలు చేయడం లేదని, జిల్లాలో మాత్రమే బదిలీలు చేయడం వలన మరలా ఏజెన్సీ లోనే పనిచేయవలసిన దుస్థితి తలెత్తుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.. %+ూ.చీూ%.71 జీవో ప్రకారం ఏజెన్సీ ప్రాంతం లో రెండేళ్లు పనిచేసినవారికి మైదాన ప్రాంతానికి బదిలీ చేయమని చెప్పిన్నప్పటికి అధికారులు మాత్రం ఏజెన్సీ నుండి మైదాన ప్రాంతం అయిన అనకాపల్లి జిల్లాకు బదిలీలు చేయలేదని, అన్ని శాఖలవారు వారి సిబ్బందిని %+ూ.చీూ%.71 ప్రాతిపదిక ప్రకారం బదిలీ చేసివున్నారు కాని ఒక్క ఉమ్మడి విశాఖ జిల్లా (అల్లూరిసీతారామరాజు జిల్లా) పోలీసు సిబ్బందికి మాత్రం నాలుగేళ్లకు పైగా పనిచేసినప్పటికీ బదిలీలు మాత్రం లేవని,. దీంతో తమ కుటుంబాలు గత నాలుగేళ్ల నుండి కుటుంబాలకు దూరంగా ఉండటం వల్ల కుటుంబ సభ్యుల్లో తీవ్రమైన అందోళనలకు గురి అవుతున్నామని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న వారి కుటుంబ సభ్యుల ఆవేదనను సంబంధిత శాఖ ఉన్నదికారులు అర్థం చేసుకొని, ఉమ్మడి 13 జిల్లా ప్రాతిపదికన మైదాన ప్రాంతాలకు బదిలీలు చేసి, తమ కుటుంబాలకు న్యాయం చేయాలని ఆ ప్రకటనలో వారు కోరారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అందిస్తున్న ప్రోత్సాహం వల పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. జగనన్న అమ్మఒడి నిధుల విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 1 వెయ్యి 170 మంది విద్యార్థులకు రూ.151 కోట్ల 75 లక్షల 50వేలను ప్రభుత్వం జమ చేసిందన్నారు. అమ్మ ఒడిని సద్వినియోగం చేసుకుని చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఇంటర్మీడియట్ తరువాత విద్యార్థులు బయట ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలని స్పష్టం చేసారు. ఏజెన్సీ నుండి బయటకు వెళితే పోటీ ప్రపంచంపై అవగాహన వస్తుందన్నారు. పాడేరు శాసన సభ్యురాలు కొట్టి గుర్ది భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకుని వచ్చిందన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచి నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. విద్యా రంగానికి రూ.62 వేల కోట్ల నిధులను బడ్జెట్లో కేటాయించారని పేర్కొన్నారు. అరకు శాసన సభ్యులు చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పేద విద్యార్థులను ఉన్నతంగా చదివించే బాధ్యతలు ముఖ్యమంత్రి జగనన్న చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి సలీం భాషా, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండల రావు, పాడేరు ఎంపిపి ఎస్. రత్నకుమారి, కొయ్యూరు ఎంపిపి బడుగు రమేష్ బాబు, పాడేరు పలువురు జెడ్ పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - కొయ్యూరు : రైతు సంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని ఏఎంసీ చైర్ పర్సన్ జైతి రాజులమ్మ, జడ్పిటిసి వారా నూకరాజు పేర్కొన్నారు. మండలంలోని రత్నంపేట పంచాయతీలో రైతాంగానికి ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందజేస్తున్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన చింతపల్లి ఏఎంసీ చైర్పర్సన్ రాజులమ్మ జడ్పిటిసి నూకరాజులు మాట్లాడుతూ రైతాంగానికి సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందజేస్తూ రైతు పక్షపాతిగా సీఎం జగన్ నిలిచారన్నారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సకాలంలో రైతాంగానికి విత్తనాలను పంపిణీ చేయడంతో పాటు ఖరీఫ్ సాగు ప్రారంభంలోనే పెట్టుబడి సాయంగా రాష్ట్ర ప్రభుత్వం 5500 రైతు భరోసా నగదును ఆయా రైతుల ఖాతాల్లో జమ చేయడం, రాయితీపై వ్యవసాయ పరికరాలు యంత్ర సామాగ్రిని అందచేయటం జరిగిందన్నారు. రైతాంగానికి ప్రభుత్వం అందించే రాయితీ సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకొని రైతాంగం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు జల్లిబాబులు ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్ రత్నంపేట కొండగోకిరి కినవర్తి సర్పంచులు నూకరత్నం, మునిలినాయుడు, రీమల శ్రీను వైసీపీ నేతలు పాటి శేఖర్ తిరుపతి రామరాజు తదితర పలువురు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలందరికీ చేకూరనున్న లబ్ధి

విశాలాంధ్ర - కొయ్యూరు : సచివాలయ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించి ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు చూడటమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని ఆడాకుల సచివాలయ పరిధి గ్రామాల్లో పర్యటించిన వైస్ ఎంపీపీ ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష ద్వారా పూర్తి ఉచితంగా అందించనున్న 11 రకాల సేవలు గురించి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా కుల, ఆదాయ జనన, మరణ ధ్రువపత్రాలు ముటేషన్ మరియు టైటిల్ డీడ్ పట్టాదారు పాసుపుస్తకం వివాహ ధ్రువీకరణ పత్రము కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రము, ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్ చేయుట కౌలు రైతు కార్డు, కొత్త మరియు స్ప్లిట్ రేషన్ కార్డ్స్, హౌస్ హెూల్డ్ స్ప్లిట్ చేయుట తదితర 11 రకాల ధ్రువపత్రాలను పూర్తి ఉచితంగా అర్హులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ అప్పన గజ్జయ్యదొర, సచివాలయ కన్విన‌ర్లు గాడి అచ్చిరాజు, ధోని బాబ్జీ,గృహసారథులు, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.